విరాళాల సేకరణ

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండల కేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు వరద బాధితుల సహాయార్థం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. బుధవారం మండల కేంద్రంలో ఆపన్నహస్తం అందించాలని పలువురిని కోరారు. నిధులు సేకరించి బాధితులకు పంపిస్తామని విద్యార్థులు తెలిపారు.

ప్రత్యామ్నాయ రాజకీయాలకు ఏచూరి దిక్సూచి

సంస్మరణ సభలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న విటపు బాలసుబ్రమణ్యం



అంజయ్య



దామోదరం

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : ప్రస్తుత మతోన్మాద పరిస్థితులలో ప్రత్యామ్నాయ రాజకీయాలకు సీతారాం ఏచూరి దిక్సూచి లాంటి వారిని పలువురు వ్యక్తులు ఉద్ఘాటించారు. స్థానిక యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షతన సీతారాం ఏచూరి సంస్మరణ సభ బుధవారం నిర్వహించారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర ఉపాధ్యక్షులు చిన్నం పెంచలయ్య, పలువురు ప్రజానాట్యమండలి నాయకులు సీతారాం ఏచూరిని స్మరిస్తూ గీతాలాపనలు చేశారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు మాట్లాడుతూ చదవడం ద్వారా పోరాటపటిమను పొంది, దానిని ఆచరణలో చూపించిన ఘనత ఏచూరిది అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్యూనిస్టులను ప్రభావితం చేసిన వ్యక్తి ఆయనని కొనియాడారు. తెలుగువాడైన ఏచూరి ఎస్ఎఫ్ఐ జాతీయ నాయకుడుగా, జేఎన్‌యులో ఆదర్శ విద్యార్థిగా ఎదిగి, సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీని మరింత బలోపేతం చేశారన్నారు. నిస్వార్థ రాజకీయాలకు అంకితమైన వ్యక్తి ఏచూరి అని తెలిపారు. ఆయనను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. టీటీడీ మాజీ చైర్మన్, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ నిజాయితీ నిబద్ధత ప్రస్తుత రాజకీయాల్లో కనపడేది కేవలం కమ్యూనిస్టుల్లో మాత్రమే అన్నారు. ప్రస్తుత మత భావాజాలం దేశ రాజకీయాలను చిదిమి వేశాయని, మతోన్మాదశక్తులు పెట్రేగి దేశాన్ని కబలిస్తున్నాయన్నారు. మేధావులు సైతం అక్షరాన్ని బయట పెట్టేందుకు భయపడుతున్నారని, అందరివి మూగరోదనలగానే మిగులుతున్నాయని అన్నారు. ఇలాంటి తరుణంలో ప్రత్యామ్నాయ శక్తులన్నీ ఏకతాటిపై నడుపున ఘనత ఏచూరిదని కొనియాడారు. ఆయనని నేటి యువత స్ఫూర్తిగా తీసుకొని, లౌకికవాద రాజ్యాన్ని నిలిపేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ విటపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ పార్టీలు బలహీన పడవచ్చు పార్టీ భావజాలం మాత్రం ఎప్పుడు బలంగానే ఉంటుందన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని నమ్మి, ఆ భావాజాలాన్ని సమాజంలోకి చేర వేసి, యువతను ఆ దిశగా నడిపించడంలో సీతారాం ఏచూరి నిరంతరం కృషి చేశాడన్నారు. భారతీయ సమాజం లౌకికవాదం సామాజిక స్పృహ, తోటి వారు పట్ల ప్రేమను ఇంకా కోల్పోలేదని, పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఏచూరికి నివాళు లర్పించేందుకు వచ్చిన జనమే ఎందుకు నిదర్శనమన్నారు. స్విమ్స్ మాజీ డైరెక్టర్ జి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ సీతారాం ఏచూరి ఆసియాలను స్ఫూర్తిగా తీసుకొని, భవిష్యత్ తరాలు కూడా గుర్తుంచుకునే విధంగా రాబోవు రోజుల్లో పోరాటస్ఫూర్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్రకోశాధికారి కెవి.చౌదరి మాట్లాడుతూ వామపక్ష సిద్ధాంతాలను తాను ఎప్పుడూ గౌరవిస్తానని, కమ్యూనిస్టులకు సానుభూతిపరుడుగా ఉంటున్నానని, వారి పోరాటాలకు తాను సంపూర్ణ మద్దతు ఎప్పుడు తెలియజేస్తానని తెలిపారు. సీనియర్ జర్నలిస్టు రాఘవ శర్మ మాట్లాడుతూ సీతారాం ఏచూరి గొప్ప రాజనీతిజ్ఞుడని, ప్రతి ఒక్కరిని కలుపుకొని తత్వం, లౌక్యంగా వ్యవహరించడం ఆయనకు అదనపు ప్రతిభ అన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి మాట్లాడుతూ సీతారాం ఏచూరి విద్యార్థి దశనుండే వేలాదిమంది కార్యకర్తల్లో స్ఫూర్తిని నింపి, పోరాటాల వైపు నడిపారన్నారు. ఆయన ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఆర్.పి.ఐ దక్షిణాది రాష్ట్రాల అధ్యక్షులు పి.అంజయ్య మాట్లాడుతూ ఆదివాసులు దళితులు కమ్యూనిస్టులు కలిసి పోరాడితేనే లౌకికవాద సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేయగలమని నమ్మి, ఆ దిశగా నినాదించిన వ్యక్తి సీతారాం ఏచూరి అని తెలిపారు. నీల్ లాల్ కలిసి పనిచేయాలని, నేటి యువత ఆయనని స్ఫూర్తిగా తీసుకొని ముందుకు వెళ్లాలని తెలియజేశారు. కార్యక్రమంలో టి.సుబ్రహ్మణ్యం, సాయిలక్ష్మి, అంగేరి పుల్లయ్య, జనార్ధన్, మల్లారపు నాగార్జున్, సిపిఐ, సిపిఎం నాయకులు, వామపక్షాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కేవి చౌదరి

కందారపు మురళి

పి.మురళి

నేడు బంగారుపాళ్యంకు మంత్రుల రాక

పర్యటనలో స్వల్ప మార్పు

బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లు గురువారం బంగారుపాళ్యం రానున్నారు. బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని వారు శుక్రవారం ప్రారంభించనున్నారు. గురువారం మధ్యాహ్నం 12గంటలకు విజయవాడ నుంచి తిరుపతి విమానాశ్రయం చేరుకొని అక్కడి నుంచి రోడ్డు మార్గం గుండా బయలుదేరి సాయంత్రం 5గంటలకు బంగారుపాళ్యంకు విచ్చేయనున్నారు. రాత్రి బస చేసి శుక్రవారం ఉదయం 11గంటలకు డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నారు. ఆ తరువాత ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొని తిరిగి 2గంటలకు బయలుదేరి తిరుపతి విమానాశ్రయం చేరుకొని అక్కడ నుంచి విజయవాడకు వెళ్లనున్నారు. కాగా అధికారులు ప్రకటించిన ప్రకారం గురువారం ప్రారంభించాల్సి ఉండగా కార్యక్రమంలో స్వల్ప మార్పు చేసి శుక్రవారం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆ మేరకు ఆసుపత్రి వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు.

పోడియం తొలగింపు

- సాధారణ టేబుల్‌పైనే రిజిస్ట్రార్ కార్యకలాపాలు

టేబుల్‌పై నుంచి కార్యకలాపాలు సాగిస్తున్న రిజిస్ట్రార్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో పోడియం తొలగించాలని ఇటీవలే రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా బంగారుపాళ్యం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో అధికారులు పోడియంను తొలగించారు. బుధవారం నుంచి సాధారణ టేబుల్‌పై నుంచే రిజిస్ట్రార్ కార్యకలాపాలు సాగిస్తున్నారు. సాధారణ పరిపాలన విధానాలను కొనసాగించాలన్న ప్రభుత్వ నిర్ణయంతో పోడియం తొలగించినట్లు ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు.

పోలీస్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలోని నింద్ర పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తూ ఈనెల 10వ తేదీన రోడ్డు ప్రమాదంలో కానిస్టబుల్ వినోద్ కుమార్ మరణించారు. ఐడిఆర్ఎఫ్ ఫండ్ నుంచి మృతుడు వినోద్‌కుమార్ సతీమణి కళావతికి రూ.లక్ష పోలీస్ శాఖ నుంచి మంజూరు చేశారు. చెక్కును హోంగార్డు ఆర్ఐ సుధాకర్ సమక్షంలో ఎస్పి మణికంఠ చందోలు చేతుల మీదుగా అందజేశారు. డిపార్ట్‌మెంటు పరంగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని ఎస్పి భరోసా ఇచ్చారు.

ఓటరు జాబితా సర్వే త్వరగా పూర్తి చేయాలి: ఆర్‌డీవో

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ఓటరు జాబితా ఇంటింటి సర్వేను వందశాతం పూర్తి చేయాలని చిత్తూరు ఆర్‌డీవో చిన్నయ్య, కమిషనర్ నరసింహ ప్రసాద్ క్షేత్ర స్థాయి పరిశీలన అధికారులను ఆదేశించారు. బుధవారం నగర పాలక కార్యాలయంలో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమీక్షించారు. వారు మాట్లాడుతూ ప్రీ రివిజన్ కార్యక్రమాల్లో భాగంగా.. ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా ఒక కుటుంబంలోని సభ్యుల పేర్లన్నీ ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇంటి నెంబర్లలో పొరబాట్లు ఉంటే గుర్తించాలని సూచించారు. ఓటర్ల పేర్లు, చిరునామాలు తప్పులు ఉంటే గుర్తించి సరిచేయాలన్నారు. బీఎల్వోలను సమన్వయం చేసుకొని సకాలంలో దరఖాస్తులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం అధికారులు, సూపర్వైజర్ అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ ఆలోచనలు మానుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: నూతనంగా ప్రారంభించిన 17 కళాశాలలకు గాను 5 కళాశాలలు గత విద్యా సంవత్సరం ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరం మరో 5 కళాశాలలు నిర్మాణం పూర్తిచేసి ప్రారంభం కావాలి. కానీ తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కళాశాలల నిర్మాణాలు నిలిపివేసి పబ్లిక్ ప్రయివేటు పీపుల్స్ పార్ట్నర్‌షిప్ (పి4) విధానంలో నిర్మించాలని ఆలోచన చేయడం గర్హనీయం. దీనిని వెంటనే మానుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీని ప్రభావంగా ఈ విద్యా సంవత్సరం రాష్ట్రానికి రావాల్సిన మెడికల్ సీట్లలో 700సీట్లు విద్యార్థులు కోల్పోతున్నారు. పులివెందుల కళాశాలకు 50సీట్లు కేటాయించగా రాష్ట్ర ప్రభుత్వం కళాశాలకు వసతులు కల్పించలేమని ఎన్ఎంసి లేఖ రాయడం శోచనీయం అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటీకరణ ఆలోచనను వెనక్కు తీసుకొని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలో నిర్మాణాలు చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం కొత్త ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సెల్ఫ్ ఫైనాన్సింగ్, ఎన్ఆర్ఐ సీట్లకు అవకాశం కల్పిస్తూ తెచ్చిన జి.వో.నెం.107, 108లను రద్దు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకొని వెంటనే జీవోలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కలతోనే జీవుల మనుగడ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: మొక్కలతోనే మానవులు, ఇతర జీవుల మనుగడ సాధ్యమవుతుందని సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్ చెప్పారు. స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం కొంగారెడ్డిపల్లి పూల మార్కెట్ వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. పూలమార్కెట్ వద్దనున్న స్థలాన్ని శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని పెద్ద చేయడం ద్వారా భావితరాలకు నాణ్యమైన ఆక్సిజన్‌లో అందించవచ్చున్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట.. ప్రతి ఒక్కరు.. మొక్కలు నాటి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, ఆర్‌వో గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్స్పెక్టర్లు లోకానాథం, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యువత సమన్వయం పాటించాలి

డీఎస్పీ పార్థసారథి

విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం రెవెన్యూ డివిజన్ పరిధిలో యువత సమన్వయం పాటించాలని డీఎస్పీ పార్థసారథి తెలిపారు. బుధవారం ఆయన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 11వ తేదీ పట్టణంలో చోటు చేసుకున్న చిన్నపాటి గొడవ దాడులకు దారితీసిందన్నారు. వినాయక చవితి చందాల విషయంలో జరిగిన గొడవలో భాగంగా ఆరోజు అర్ధరాత్రి సుమారు రెండు గంటల ప్రాంతంలో మునస్వామిపురంకు చెందిన వినయ్‌పై పట్టణానికి చెందిన ఎనిమిది మంది దాడికి పాల్పడడం జరిగిందన్నారు. వీరిలో బాలనాగరాజు, శ్రావణ్ రాజు, శివసాయిరాజు, తరుణ్, ఆది, ఉమాశంకర్, జ్ఞానప్రకాష్ అను ఏడుగురిని పోలీసులు అదుపులోనికి తీసుకోవడం జరిగిందన్నారు. మరో నిందితుడు శ్రీహర్ష పరారీలో ఉన్నట్టు తెలిపారు. అదేవిధంగా మంగళవారం రాత్రి బాబు నగర్‌లో ఇరు వర్గాలు దాడులకు పాల్పడ్డట్టు తెలిపారు. ఈ దాడులకు సంబంధించి 19 మందిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడులకు మద్యం మత్తులో జరిగిందని, యువత మత్తుకు దూరంగా ఉండాలని తెలిపారు. భవిష్యత్తులో దాడులకు పాల్పడిన వారిపై చట్టరీత్య కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా మునిస్వామిపురంలో జరిగిన దాడులకు సంబంధించిన నిందితులను రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో పట్టణ సిఐ జిటి నాయుడు పాల్గొన్నారు.

ఆర్‌జెయూకేటీ రిజిస్ట్రార్‌గా అమరేంద్ర కుమార్

ప్రజాశక్తి-పూతలపట్టు: ఆర్‌జెయూకేటీ రిజిస్టర్‌గా పూతలపట్టు మండలం కమ్మ గుట్టపల్లి గ్రామానికి చెందిన అమరేంద్ర కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. బాలయ్య నాయుడు విజయ లక్ష్మమ్మ కుమారుడు, అమరేంద్ర కుమార్ విజయవాడలోని రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్ జి యుకేటి)లో రిజిస్టర్‌గా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ సివిల్ ఇంజనీర్ విభాగం ప్రొపెసర్ అమరేంద్ర కుమార్‌ను నియమిస్తూ వర్సిటీ ఉపకులపతి ఆచార్య విజయ్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో రిజిస్టర్‌గా ఉన్న ప్రొఫెసర్ గోపాల్ రాజు పదవీకాలం పూర్తి కావడంతో ఆయన స్థానంలో ఈయనను నియమించారు. అమరేంద్ర కుమార్ గతంలో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జిమినేషన్స్‌గా, పరిపాలన అధికారిగా బాధ్య

బాధ్యతలు చేపట్టిన అమరేంద్ర కుమార్

డైరెక్టర్‌గా వర్సిటీ యూజీ-2024 ప్రవేశాల విభాగం కన్వీనర్‌గా పనిచేశారు. ఇడుపులపాయ నూజివీడు ఒంగోలు శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీల పాలన వ్యవహారాలను పరివేక్షించనున్నారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనే లక్ష్యంగా కృషి చేస్తామని అమరేంద్ర కుమార్ తెలిపారు.

భయ రెడ్డిపల్లి

దగ్ధమవుతున్న షాపులు

ట్రాక్టర్‌కు నిప్పంటించిన దుండగులు

కాలిపోయిన మల్లి చెట్టు

- కునుకులోనూ అగ్ని కీలల కలవరమే..
- వరుస ఘటనలతో స్థానికుల్లో వణుకు
- ఏ రాత్రి ఏం జరుగుతుందోనన్న ఆందోళన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లిలో షాపులకు నిప్పంటిస్తున్న ఘటనలు స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఏ రాత్రి ఏం జరుగుతుందోనన్న భయం అక్కడి వారిని కలవరపెడుతోంది. అటు షాపులు, వాహనాలు, వృక్ష్యాలను దుండగులు రాత్రిల్లో వచ్చి ఉద్దేశపూర్వకంగానే తగులబెట్టేస్తున్నారు. బైరెడ్డిపల్లి నాలుగు రోడ్ల కూడలి(చెక్‌పోస్ట్) వద్ద ఇప్పటికే వేర్వేరు రోజుల్లో మూడు దుకాణాలను తగులబెట్టారు. రాత్రిల్లోనే జరుగుతున్న ఈ వ్యవహా రాలపై స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. మం డల కేంద్రంలో చోటు చేసుకుంటున్న ఘటన లతో కలవరపాటుకు గురవుతున్నారు.

ఆగస్టులో..

- 12వ తేదీన బైరెడ్డిపల్లి నాలుగురోడ్ల కూడలిలో (చెక్‌పోస్ట్) ప్రాంతంలో పాదరక్షల దుకాణం, కూల్‌డ్రింక్ షాపునకు నిప్పంటించారు. దీంతో షాపులు పూర్తిగా దగ్ధమైయ్యాయి.
- 13వ తేదీన మండల కేంద్రంలోని మహ్మద్ వీధిలో నివాసం ఉంటున్న అబ్దుల్ రహీం సాహెబ్ ఇంటి ప్రాంగణంలో ఉన్న మల్లి చెట్టుకు యాసిడ్ పోసి కాల్చేశారు.
- 14వ తేదీన బైరెడ్డిపల్లి పెద్దచెరువు వద్ద శేషగౌడయ చెందిన ఇటుకల బట్టీల వద్ద ట్రాక్టర్‌ను తగులబెట్టారు.

సెప్టెంబర్‌లో..

- ఈ నెల (సెప్టెంబర్)6వ తేదీన నాలుగు రోడ్ల కూడలి (చెక్‌పోస్ట్) వద్ద కిరాణా షాపునకు నిప్పు వేశారు. దీంతో షాపు, వస్తువులు పూర్తిగా కాలిపోయాయి.

పోలీసుల నుంచి నో యాక్షన్..

వరుస ఘటనలపై కేసులు నమోదు చేస్తున్నామని పోలీసులు చెబుతున్నా.. ఛేదనలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదు. మండల కేంద్రంలోనే వరుస పరిణామాలు వెలుగు చూస్తున్నప్పటికీ ఎలాంటి చర్యలు లేకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పేద వర్గాలకు చెందిన ప్రజలు చిన్నపాటి దుకాణాలు నడుపుకొంటుండగా రాత్రిల్లో నిప్పంటించడం తీవ్ర పరిణామమే. అయితే దుండగులను కనుగొని కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసుల వైపు నుంచి ఎలాంటి చర్యలు కనిపించడం లేదు. దీంతో బాధితుల నుంచి ఒకింత అసహనం వ్యక్తమవుతుండగా.. స్థానికులు మాత్రం ఏ రోజున రాత్రి ఎక్కడ నిప్పంటిస్తారోనన్న భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిల్లో గస్తీ పెంచి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని బైరెడ్డిపల్లి వాసులు కోరుకుంటున్నారు.

నెలన్నరగా ఎస్ఐ పోస్ట్ ఖాళీ..

బైరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్‌లో నెలన్నరగా ఎస్ఐ పోస్ట్ ఖాళీగా ఉంది. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ కృష్ణయ్య చిత్తూరు వీఆర్‌కు బదిలీ అయ్యారు. జులై 28న స్టేషన్ నుంచి రిలీవ్ అయ్యారు. దీంతో నెలన్నరగా స్టేషన్‌లో ఎస్ఐ లేకపోవడం గమనార్హం. ఎస్ఐ బదిలీ కావడం, ఇక్కడికి ఇంకా కొత్త ఎస్ఐ రాకపోవడం కూడా కేసుల ఛేదనలో కాస్త ఆలస్యం అవుతోందని పోలీసుల వైపు నుంచి వినిపిస్తున్న మాట. వెనువెంటనే ఎస్ఐని నియమించి చర్యలు తీసుకోవాలని అటు ప్రజలు కోరుతున్నారు.

అన్నదానం

ప్రజాశక్తి-పలమనేరు: తిరుపతి గంగమ్మ గుడి పునర్నిర్మాణ ధర్మకర్త స్వర్గీయ జిల్లేడు గుణశేఖర్ నాయుడు 9వ వర్ధంతి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవరాయల విగ్రహం వద్ద బలిజ అభ్యుదయ సేవా సంఘం(బాస్) ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. జనసేన నాయకులు జిల్లేడు అరుణ్‌కుమార్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. అనంతరం గుణశేఖర్ నాయుడు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, రూపేష్, బాబు, గజేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు, కోటేశ్వర్లు, శంకరప్ప తదితరులు పాల్గొన్నారు.

బోధనలో ఆధునిక పద్ధతులు అనుసరించాలి

ప్రజాశక్తి-పలమనేరు: బోధనలో ఆధునిక పద్ధతులను అనుసరించాలని ఎంఈవో లీలారాణి పేర్కొన్నారు. బుధవారం పలమనేరులో ఉపాధ్యాయ శిక్షణ తరగతులు జరిగాయి. కార్యక్రమంలో ఎంఈవో లీలారాణి హాజరైయ్యారు. ఉపాధ్యాయులకు పలు సూచనలిచ్చారు.

ఎస్ఐకి సన్మానం

ప్రజాశక్తి-ఎస్ఆర్ పురం: నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ఆర్ పురం ఎస్ఐ సుమన్‌ను మాజీ వాటర్ షెడ్ చైర్మన్ గుణశేఖర్ నాయుడు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండలంలోని తీర్థం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో టీ గడ్డూరులో బుధవారం వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఇందులో భాగంగా హెచ్ఈ కాంతమ్మ మాట్లాడుతూ గర్భవతులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు గురించి అవగాహన కల్పించారు. వ్యక్తి గత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి ఆమె తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పి పూర్ణ, ఏఎన్ఎం సుజాత, ఏడబ్ల్యుసి జరీనా పాల్గొన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌వో మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అనారోగ్యంతో వీఆర్‌వో రాజకుమార్ మృతి చెందారు. ఈయన మండలంలోని టేకు మంద రెవెన్యూ విఆర్ఓగా విధులు నిర్వర్తిస్తున్నారు. గత కొంతకాలంగా అనారోగ్య బారిన పడి వేలూరు సిఎంసిలో చికిత్స పొందుతున్నారు. మంగళవారం రాత్రి అస్వస్థకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు చీలపల్లి సిఎంసికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతదేహానికి తహశీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పలువురు విఆర్ఓలు, సిబ్బంది నివాళులర్పించారు.

ప్రభుత్వ కళాశాలలో పేరెంట్స్ మీటింగ్

ప్రజాశక్తి-కార్వేటినగరం: స్థానిక ఆర్‌కెఎస్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.స్వరూప మాట్లాడుతూ విద్యార్థులలో విద్యాభివృద్ధి పట్ల తీసుకుంటున్న చర్యలను విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. ఉపన్యాసకులు మాట్లాడుతూ విద్యార్థుల హాజరు మొదటి రెండవ యూనిట్ టెస్ట్ ఫలితాలపై విశ్లేషణ చేశారు. ప్రభుత్వ కళాశాలలో నిబద్ధత కలిగిన క్వాలిఫైడ్ అధ్యాపకులచే బోధన జరుగుతుందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం విద్యార్థుల పఠనా సామర్థ్యాలను ప్రణాళిక ప్రకారం తల్లిదండ్రులతో చర్చించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థుల క్రమశిక్షణ పట్ల శ్రద్ధ తీసుకొని ఇంటి వద్ద కూడా చదివే విధంగా జాగ్రత్త వహించాలని ఆమె సూచన ఇచ్చారు.

పాస్టర్ జాన్ మృతి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మండలంలోని మంగర మడుగు గ్రామానికి చెందిన పాస్టర్ జాన్ సీనియర్ పాస్టర్‌గా పలమనేరు, బంగారుపాళ్యం కార్నర్ స్టోన్ చర్చి వ్యవస్థాపకుడు చర్చి పాస్టర్‌గా గత 45 సంవత్సరాలగా సువార్త చెబుతూ మంగళవారం ఉదయం మృతి చెందారు. ఆయన పార్థివ దేహానికి తమిళనాడు కర్ణాటక ఆంధ్రప్రదేశ్‌కి చెందిన పలువురు పాస్టర్లు నివాళులర్పించారు. పాస్టర్ జాన్ పేదలకు చేసిన కార్యక్రమాలను పలువురు పాస్టర్లు గుర్తు చేశారు. బుధవారం తమ స్వగృహం ముంగరమడుగులో అంతక్రియలు నిర్వహించారు.

పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- చిన్నగొట్టిగల్లు: చదువుతున్న తమ పిల్లలపై తల్లిదండ్రులు శ్రద్ధ వహిం చాలని చిన్నగొట్టిగల్లు జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్, వృత్తి విద్యాధికారి విశ్వనాథ నాయక్ బుధవారం కళాశాల లో ఏర్పాటు చేసిన తల్లిదండ్రు ల సమావేశంలో పేర్కొన్నారు. పిల్లలను కళాశాలకు పంపడంతో సరిపెట్టుకోకుండా వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి కళాశాలలో హాజరు, మార్కులు అడిగి తెలుసుకొని అధ్యాపకులతో చర్చించాలని సూచించారు. మంచి అలవాట్లు, పద్ధతులను అనుసరించేలా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు పశు వైద్య కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర పశువైద్య కళాశాల 61వ వార్షికోత్సవం గురువారం వర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు అధికారులు బుధవారం పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వర్సిటీ ఇన్‌ఛార్జి విసి ఆచార్య జేవి రమణ, అటవీ శాఖ అధికారి డాక్టర్ డి గురుస్వామి, డీన్ డాక్టర్ కె వీర బ్రహ్మాయ్య, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య హాజరవుతారని పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించండి

కలెక్టరేట్ ఎదుట యూనియన్ నాయకుల ధర్నా

కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: పంచాయితీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టరేట్ వద్ద బుధవారం ఏపీ పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కలెక్టర్ సుమిత్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కలెక్టర్ పరిశీలించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి.వెంకట్రామయ్య మాట్లాడుతూ 2014-15 సంవత్సరాలలో పనిచేసిన కార్మికులకు విధుల్లో నుంచి తొలగించేందుకు ప్రభుత్వం టెండర్ విధానాన్ని తీసుకుని వచ్చిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో కేసులు వేయగా హైకోర్టు కార్మికులకు అనుకూలంగా తీర్పు ఇచిందన్నారు. తీర్పుని అమలు చేయాలని ఒక సంవత్సరంగా తిరుగుతున్నా ఇప్పటికి అమలు చేయడం లేదన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1,225 మంది కార్మికులను రెగ్యులర్ ఉద్యోగాల్లో కొనసాగించాలని వారిని పర్మినెంట్ చేయాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చినా ఇప్పటివరకు అమలు కావడం లేదన్నారు. అన్ని రకాలుగా పంచాయతీల్లో సేవ చేస్తున్నామని తమ సేవను గుర్తించి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఎం, డిప్యూటీ సీఎంలు న్యాయం చేయాలని కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాంచివరం సురేంద్ర మాట్లాడుతూ అట్టడుగు నుండే పంచాయతీ కార్మికులను వారి సమస్యలను అధికారులు పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా పంచాయతీ కార్మికుల జిల్లా కార్యదర్శి గోవిందప్ప, అన్నమయ్య జిల్లా కార్యదర్శి సురేంద్ర, నాగరాజా, తిరుపతి జిల్లా కార్యదర్శి రాము, నాగభూషణం, శ్రీనివాసులు, రామకృష్ణ, మురళి, అంజమ్మ, ధనమ్మ, కృష్ణంరాజు, మల్లయ్య పాల్గొన్నారు.

సమయానికి రారంటే రారు..!

- సమయ పాలన పాటించని సిబ్బంది

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని కోసలనగరం సచివాలయ సిబ్బందులు సరైన సమయానికి కార్యాలయానికి రావటం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు. పనివేళకు రారంటే రారని, కార్యాలయానికి వచ్చినా ప్రయోజనం లేక తిరిగి వెళ్లే పని తప్పడం లేదని చెబుతున్నారు. ఈ విషయం అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం 12 సచివాలయంలో 107మంది సిబ్బంది పని చేస్తున్నారు. కార్యాలయం చుట్టు తిరిగినా ఏ పని జరగడం లేదని జనాలు గగ్గోలు పెడుతున్నారు. ఒక్కో సర్టిఫికేట్ కోసం పలు సార్లు తిరగాల్సి వస్తోందని స్థానికుల ఆరోపణ. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి సిబ్బంది సమయపాలన పాటించేలా ఆదేశాలివ్వాలని, ఆ మేరకు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

సూర్య ఘర్ యోజన పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: ప్రభుత్వ సబ్సిడీతో గృహాలకి ఇంటి పైకప్పు మీద సోలార్ రూఫ్ టాప్ నెలకొల్పుటకు పిఎం సూర్య ఘర్ ముఫ్ట్ బీజలి యోజన కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో పథకం అమలుపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం గృహ వినియోగదారులకి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా లబ్ధి పొందేందుకు సంబందిత అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు జెడ్‌పి సిఈఓ గ్లోరియా, డిఆర్‌డిఎ పీడీ తులసి, డీపీవో లక్ష్మి, ఎల్‌డీఎం హరీష్, ఎపిఎస్ పిడిసిఎల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు, నెడ్ క్యాప్ డెవలప్మెంట్ ఆఫీసర్ అబ్దుల్ గయాజ్, తదితరులు పాల్గొన్నారు.

మల్బరీ సాగుపై అవగాహన

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-తవణంపల్లి: మండలంలోని పుణ్యసముద్రం ఆర్‌బీకేలో మల్బరీ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న పట్టుపరిశ్రమ శాఖ సహయ సంచాలకులు మోహన్ బాబు మాట్లాడుతూ నీటి వసతి ఉన్న రైతులు మల్బరీ సాగు చేసుకుంటే మంచి ఆదాయం పొందవచ్చునని, సాగుచేయడానికి మొక్కలకు కూడా రాయితీ ఉందన్నారు. పట్టు పురుగుల పెంపకానికి షెడ్డు నిర్మాణానికి కూడా రాయితీ ఇవ్వడం జరుగుతుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు షెడ్డు నిర్మాణానికి, మొక్కల పెంపకం కోసం 90శాతం రాయితీ, ఇతర రుతులకు 70శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా రైతులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఏవో జి.ప్రవీణ్, వెంకట లక్ష్మమ్మ, సెరికల్చర్ అధికారి గణేష్ గౌడ్, సాంకేతిక అధికారి జ్యోతి, సుహాసిని, రైతులు పాల్గొన్నారు.

నష్ట పరిహారం అందజేత

చెక్కును అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: మండలంలోని పిఎంకె తాండ గ్రామంలో ఏనుగుల దాడుల్లో నష్టపోయిన పంటకు నష్టపరిహారం అటవీ అధికారులు, ప్రజాప్రతినిధులు అందజేశారు. బుధవారం రూ.18వేల చెక్కును దనపాల్ నాయక్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. టిడిపి ప్రభుత్వంలో ఏనుగు దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకొని కందకాలు, సోలార్ కంచె మరమ్మతులు చేసి ఏనుగులు పంటలపై రాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో కందకాలు సోలార్ కంచె ఏర్పాటుకు కోట్ల రూపాయలు నిధులను ఖర్చు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కృష్ణా నాయక్, హరిబాబు, సుబ్రహ్మణ్యం, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ

ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంఈఓ సుబ్రమణ్యం చేతుల మీదుగా జన విజ్ఞాన వేదిక వారి చెకుముకి టాలెంట్ టెస్ట్ కర పత్రాలు, ప్రచార పోస్టర్లలను ఆవిష్కరించారు. ప్రస్తుతం 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులు ఈ టాలెంటి టెస్ట్‌లో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఈనెల 25న పాఠశాల స్థాయి, ఆక్టోబర్ 01న, మండల స్థాయి, అక్టోబర్ 27న జిల్లా స్థాయి, నవంబరు 9,10న రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని మండల జేవివి కన్వీనర్ శశికుమార్ తెలిపారు. వివరాలకు 9885589628 సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రకాష్ పాల్గొన్నారు.

తిరుపతికి మరో బస్సు సర్వీసు

బస్సు సర్వీసు ప్రారంభిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-కుప్పం టౌన్: కుప్పం నుంచి తిరుపతికి మరో బస్సు సర్వీసును బుధవారం టీడీపీ కుప్పం ఇన్‌ఛార్జి పిఎస్ మణిరత్నం ప్రారంభించారు. కుప్పం నియోజకవర్గం టిడిపి విస్తరణ విభాగ కమిటీ సభ్యులు కన్నన్, వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ మాజీ అధ్యక్షులు సత్యేంద్ర శేఖర్‌లు జెండా ఊపి బస్సును ప్రారంభించగా కుప్పం పురపాలక సంఘం టిడిపి అధ్యక్షులు రాజ్ కుమార్ బస్సును నడిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ప్రజల సౌకర్యార్థం ఇప్పటికే పలు బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌకర్యార్థం మరిన్ని సర్వీసులను అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ఉపయోగించుకోండి

ప్రజాశక్తి-శాంతిపురం: పీఎం విశ్వకర్మ యోజన పథకాన్ని ఉపయోగించుకోవాలని ఎంపీడీవో కుమార్ సూచించారు. బుధవారం రాళ్ళబూదుగూరు గ్రామంలో పనిచేయుచున్న కార్మికులకు పీఎం విశ్వకర్మ యోజన కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సి.వనిత, సర్పంచ్ లక్ష్మీ, ఆర్.యస్.మణి, బసవరాజ్, మురళి, జయరాజు, కుమార్ పాల్గొన్నారు.

వరద బాధితులకు నగదు పంపిణీ

విరాళాన్ని అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-రామకుప్పం: విజయవాడ వరద బాధితులకు మండలంలోని పంద్యాల మడుగు పంచాయతీలోనీ టిడిపి నేతలు విరాళాలను సేకరించారు. బుధవారం మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డికి రూ.1,11,116లను అందజేశారు. సీఎం చంద్రబాబు పిలుపుమేరకు వరద బాధితులను ఆదుకోవాలని తమ వంతు సహాయంగా విరాళాలను సేకరించామన్నారు. ప్రకృతి విపత్తుకు గురైన ప్రతి ఒక్కరిని ఆదుకునేందుకు టిడిపి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో నారాయణ చారి, నరసింహులు, గంట్లప్ప గౌడు, రఫీ, విశ్వనాథ్, చంద్రశేఖర్ రెడ్డి, కామరాజు నాయక్, నవీన్, గజేంద్ర, మురళి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు చేపట్టండి

- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా జిల్లాకు కేటాయించబడ్డ ఇళ్ల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ పీడీ పద్మనాభంతో కలిసి మున్సిపల్ కమిషనర్‌లు, ఎంపిడీవోలు, హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28న కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఆవాస్ యోజనా పథకం క్రింద మంజూరైన ఇండ్లలో అసంపూర్ణంగా ఉన్న ఇండ్ల నిర్మాణాల పూర్తికి మన ఇల్లు- మన గౌరవం పేరిట కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఇందుకు సంబందిత అధికారులందరూ సన్నద్ధం కావాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పూర్తికి ఉపాది హామీ పథకం కింద 90రోజులు పని దినాలను కేటాయించడం జరిగిందని దీన్ని వినియోగించుకొని ఇండ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 77,366 మంజూరు కాగా అందులో ఇప్పటి వరకు 47,324 ఇండ్లు పూర్తి కావడం జరిగినదని మిగిలిన ఇండ్లు వివిద దశల్లో కలవన్నారు. వివిద దశల్లో నిర్మాణాలు పూర్తయిన వాటి బిల్లులను ఎప్పటికప్పుడు అప్లోడ్ చేయాలన్నారు. ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్లు హౌసింగ్ లేఔట్ లలో పర్యటించిలబ్ధిదారులతో మాట్లాడి అసంపూర్ణంగా ఉన్న ఇండ్ల నిర్మాణాల పూర్తికి దృష్టి పెట్టాలన్నారు.

మామిడి చెట్లకు నీరు తప్పక అందించాలి

ప్రజాశక్తి- యర్రావారిపాలెం : మండలంలో ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉండడంతో మామిడి చెట్లు తీవ్ర ఉష్ణోగ్రతను ఎదుర్కొం టున్నా యని మామిడి చెట్లకు డ్రిప్ ద్వారా నీరు తప్పక అందించాలని హార్టికల్చర్ ఆఫీసర్ శివకుమారి తెలిపారు. బుధవారం ఎలమంద పంచాయతీలో మామిడి తోటలను ఆమె పరిశీ లించి ప్రస్తుతం మామిడి చెట్లకు కొమ్మలు కత్తిరించి కాపర్ ఆక్సీ క్లోరైడ్ పిచికారీ చేసి నీటిని అందించాలని రైతులకు సూచించారు. పంట సమయంలో తేనెమంచు పురుగు, గొంగళి పురుగు నివారించడానికి వేప నూనె లేక వేప కషాయంతో పాటు క్లోరో ఫైర్పాస్ కలిపి పిచికారీ చేయాలని పేర్కొన్నారు.

'పన్ను కట్టకుంటే కుళాయ్ కట్'

పన్ను కట్టని ఇంటికి నీటి కనెక్షన్ తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీలో ఆస్తి, నీటి పన్నులు చెల్లించుకుంటే మొండి బకాయిలుగా ఉన్నవారికి నీటి కనెక్షన్లు తొలగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగానే సూర్య నగర్‌లో ఓ ఇంటికి ఆస్తి పన్ను సుమారు నాలుగేళ్ల పాటు 18వేలు చెల్లించవలసి ఉండగా నీటి కనెక్షన్‌ను తొలగించడం జరిగిందని చెప్పారు. సూర్య నగర్ ప్రాంతంలో ఆస్తిపన్ను బకాయిలు చాలా ఉన్నాయని మొదటిరోజు మాత్రం ఒకరికే నీటి కనెక్షన్ తొలగించమని, రేపు నుంచి ఎవరైతే బకారున్నారో వారి ఇండ్లు అన్నిటికీ నీటి కనెక్షన్ తొలగించడం జరుగుతుందన్నారు. కావున ఈ సంఘటన గమనించి పన్ను బకాయి ఉన్న యజమానులు అందరూ వెంటనే చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జహీర్, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఓజోన్ పొర దినోత్సవం

ప్రజాశక్తి-వెదురుకుప్పం: రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఓజోన్ పొర దినోత్సవాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.అన్నపూర్ణ శారద అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. వాతావరణంలోని ఓజోన్ పొర సూర్యకాంతిలోని అతినీలలోహిత కిరణాలను శోషించుకోవడం ద్వారా భూమిపై ఉన్న జీవరాశులను రక్షిస్తున్నదని ఆమె అన్నారు. అయితే, ఈ పొర అనేక కారణాల వలన క్షీణిస్తున్నదని, దీనివలన సూర్య కాంతిలోని అతినీలలోహిత కిరణాలు భూమి పైనున్న జీవరాశులపై నేరుగా పడి అనేక రుగ్మతలకు కారణమవుతున్నదని అన్నారు. ఈ విషయంపై విద్యార్థులలో అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ వి.ప్రభాకర రావు, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న లత, బోటనీ విభాగం అధిపతి డాక్టర్ భక్షు, ఐ క్యూ ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ పి.వెంకటేశు తదితరులు పాల్గొన్నారు.

పూడిపోయిన కాలువ

ప్రజాశక్తి-విజయపురం: కోసలనగరం మీదుగా పాతర్కాడు చెరువుకు వెళ్లే ఒరవ కాలువ పూడిపోయింది. దీంతో వర్షాలు పడినప్పుడు వర్షపు నీరు గ్రామంపై ప్రవహిస్తున్నాయని, ఒక్కొసారి ఇళ్లలోకి వర్షపు నీరు చేరుతున్నాయని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలంలో అక్కడక్కడ నీరు నిలవడం, దుర్వాసన వెదజల్లడం, దోమలు ప్రబలి ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కాలువకు ఇరు వైపు పిచ్చిమొక్కలను, తొలగించాలని, ప్రొడక్షన్ వాల్ నిర్మించాలని కోరుకుంటున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా వర్షపు నీరు వృథాగా పోవడమే కాకుండా పాతర్కాడు చెరువులోకి నీరు చేరడం లేదు. ఇప్పటికైన అధికారులు ఒరవ కాలువను సరి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఎక్స్‌ప్రెస్ కారిడార్‌కు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: చిత్తూరు - తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కారిడార్‌కు సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ నాయకులు రామానాయుడు డిమాండ్ చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఇబ్బందులకు గురి చేస్తే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. బుధవారం చిత్తూరు నేషనల్ హైవే కార్యాలయం వద్ద సిపిఐ, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం నేషనల్ హైవే పీడీకి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, నాయకులు గోపినాథ్, మణి, చంద్ర, విజయ్‌కుమార్, రఘు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

- ఇద్దరు నిందితులు అరెస్ట్
- ఈచర్ వాహనం సీజ్

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి ఈచర్ వాహనాన్ని సీజ్ చేసినట్లు సిఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. రాబడిన సమాచరం మేరకు.. మంగళవారం రాత్రి మండలంలోని పాలేరు ఫ్లై ఓవర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బెంగళూరు నుంచి చెన్నైకి వెళ్తున్న తపాలా శాఖ ట్రాన్స్పోర్ట్ వాహన అడ్డుకున్నట్లు చెప్పారు. డ్రైవర్ వాహనాన్ని ఆపి పారిపోతుండగా అతన్ని అదుపులోకి తీసుకొని వాహన క్యాబీన్లో తనిఖీలు చేపట్టామన్నారు. కర్ణాటక మద్యం 25ఫుల్ బాటిల్ ఉండడాన్ని గుర్తించామన్నారు. తమిళనాడు రాష్ట్రం తూతుకుడి జిల్లా కామరాజ్ మండలం మధురాంతకం గ్రామానికి చెందిన అయ్యప్ప, అదేవిధంగా బంగారుపాలెం మండలం మొగిలివారిపల్లికి చెందిన చంద్రమోహన్ నాయుడు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం

ప్రజాశక్తి-కుప్పం రూరల్: కుప్పం చెరువు కట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి దుర్మరణం పాలైన ఘటన బుధవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. మంజునాథ్ రెడ్డి, ఆనంద్ బాబు, పునీత్ కుమార్‌లు ద్విచక్ర వాహనంపై వెళుతూ ట్రాక్టర్‌ను ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో మంజునాథ్ రెడ్డి ఘటనా స్థలంలోనే మరణించగా, మరో ఇద్దరు క్షతగాత్రులను వైద్య సేవలు నిమిత్తం స్థానిక పిఈఎస్ ఆసుపత్రికి తరలించారు. మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

కర్ణాటక మద్యం స్వాధీనం

- వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-పెద్దపంజాణి: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ బి.సహదేవి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. కొళత్తూరు పంచాయతీ గల్లావారిపల్లి గ్రామానికి చెందిన శ్రీరాములు మండలంలోని రాజుపల్లి చెక్ పోస్ట్ వద్ద ద్విచక్ర వాహనంలో కర్ణాటక నుంచి 1008 టెట్రా పాకెట్స్ తరలిస్తున్నారని రాబడిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేశామన్నారు. అక్రమ మద్యాన్ని గుర్తించి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకోని అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్ పంపించినట్లు వెల్లడించారు.

Vth COURT BEFORE THE MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL AT CHENNAI
MCOP.No. 1969 OF 2024
1.S. Changalrayulu
2.S.Harshitha
3.S.Prabu Kiran) (Third Petitioner being minor, rep by his father and next Friend S.Changalrayulu **...Petitioner**
VS
1. Chandrasekaran Palanisamy **...1st Respondent**
2. ICICI Lombard General Insurance, Co, Ltd **...2nd Respondent**
TO
Chandrasekaran Palanisamy No.20-486, Post Office Lane, Mittoor, Chittoor Urban, Chittoor Andhra Pradesh, PIN-517002. **... 1st Respondent**
Take notice that the above case is posted to 16.10.2024 at 10.30am before the Hon'ble Vth Judge of Motor Accident Claims Tribunal, Chennai for your appearance either in person or through pleader without fail or otherwise the matter will be decided in your absence.
Sd L.MOHAN RAO
ADVOCATE, CHENNAI
Counsel for the Petitioner

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
షార్ట్ టెండర్ నోటీసు సంఖ్య.02/ ఇఇ(ర.భ) చిత్తూరు/ టెండరు/.టి.ఓ/2024-2025, తేది: 18.09.2024
చిత్తూరు (ర.భ) డివిజన్ పరిధి లోని ఈ ఐదు పనులకి గాను సుమారు రూ.3,50,000/- అంచనాతో 2024-2025 సంవత్సరమునకు గాను, రెండు నెలలకు సీలు వేసిన టెండర్లు ఆహ్వానించడమైనది. టెండర్ షెడ్యూల్ జారీ చేయు తేది: 21.09.2024 నుండి 30.09.2024 మధ్యాహ్నం 1:00 గంట వరకు, టెండరుదారులు తమ టెండర్లను దాఖలా చేయు తేదీలు : .21.09.2024 నుండి 30.09.2024 మధ్యాహ్నం 3.00 గంటల వరకు. తదుపరి వివరములకు, ఈ కార్యాలయము పని వేళలయందు పొందవచ్చును. మరియు మార్పులు చేర్పులు చేయు అధికారము కార్యనిర్వాహక ఇంజినీరు వారికి కలదు.
సం/- కార్యనిర్వాహక ఇంజినీరు,
(ర.భ.) విభాగము, చిత్తూరు.